సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం । 18 । సెప్టెంబర్ । 2024



కాంగ్రెస్‌ది దుర్మార్గ పాలన

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గపు పాలన సాగిస్తోందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆరోపించారు. 8లో



రామాలయ అర్చకులకు షోకాజ్..

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ప్రధాన, ముఖ్య అర్చకులిద్దరికీ ఆలయ ఈఓ రమాదేవి నోటీసులు జారీ చేశారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
33° / 22°

జిల్లాలో బుధవారం అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం కాస్త చల్లగా ఉన్నా మధ్యాహ్నానికి ఎండ తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. ఆ తర్వాత స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని శ్రీ అభయాంజనేయస్వామి వారికి అభిషేకం, తమలపాకులతో అర్చన గావించారు.

రామయ్యను దర్శించుకున్న నైమిశారణ్య పీఠాధిపతి..

నైమిశారణ్య పీఠాధిపతి బాల బ్రహ్మానంద సరస్వతి మంగళవారం శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని దర్శించుకున్నారు. అంతరాలయంలో మూలమూర్తులకు పూజలు చేయగా, అర్చకులు ఆలయ విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా ఆయన బేడా మండపంలో రామనామ తత్వంపై భక్తులకు సందేశం అందజేశారు.

పెద్దమ్మతల్లిని దర్శించుకున్న స్వామీజీ..

పాల్వంచరూరల్: మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయాన్ని శ్రీ బాలబ్రహ్మానంద సరస్వతి స్వామీజీ మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయనకు ఆలయ సంప్రదాయ ప్రకారం స్వాగతం పలికారు. ఆ తర్వాత ఆయన శ్రీ దుర్గా సూక్తం ప్రవచనం వినిపించారు.


రామాలయంలో వెండి ధనస్సుకు పూజలు

భద్రాచలం/చర్ల : అయోధ్య రాముడికి సమర్పించే వెండి ధనస్సుకు మంగళవారం భద్రాచలం రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. హైదరాబాద్‌కు చెందిన చల్లా శ్రీనివాసరావు అక్కడి భక్తుల ద్వారా 13 కేజీల వెండి, ఒక కేజీ బంగారం సేకరించారు. ఆ వెండితో అయోధ్య రాముడికి ఏడు అడుగుల వెండి ధనస్సు, బాణం తయారు చేయించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. దీనికి దేశ వ్యాప్తంగా ఉన్న రామాలయాల్లో పూజలు చేసి అయోధ్య రాముడికి సమర్పిస్తానని పేర్కొన్నారు. ఆ తర్వాత చర్లలోని భక్తాంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేయించి ఘనంగా శోభాయాత్ర నిర్వహిచారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సాంబయ్య, నాగబాబు, మురళి తదితరులు పాల్గొన్నారు.

మునగ సాగుతో లాభం

పాల్వంచరూరల్ : మునగ పంట సాగు చేస్తే రైతులకు రెండు రకాలుగా లాభమని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మునగ కాయలతో పాటు ఆకు కూడా పొడిచేసి విక్రయించొచ్చని చెప్పారు. మండలంలోని బిక్కుతండాలో గుగులోతు బాలాజీ అనే రైతు సాగుచేసిన మునగ పంటను మంగళవారం పరిశీలించారు. ఈ పంట సాగు చేసిన కొద్ది కాలంలోనే దిగుబడి వస్తుందని తెలిపారు. ఈజీఎస్ ద్వారా ఎకరానికి రూ.1.20 లక్షల సహాయం ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విద్యాచందన, ఎంపీడీఓ విజయభాస్కరరెడ్డి, తహసీల్దార్ వివేక్, ఎంపీఓ బి.నారాయణ, ఏఓ శంభోశంకర్, ఏపీఓ పోరండ్ల రంగా, ఏపీఎం.రాంబాబు, ఆర్ఐ.హచ్యా, కార్యదర్శి సౌజన్య పాల్గొన్నారు.

కానుక కలకలం!



సింగరేణి ఉన్నతోద్యోగులపై ఓ బడా కాంట్రాక్టర్ అభిమానం

- కొందరికి బహుమానంగా గిఫ్ట్ ప్యాక్‌లు
- రూ.లక్ష విలువైన గిఫ్ట్‌లు అందక మిగితా వారి అసంతృప్తి
- ఈ వ్యవహారంపై అంతర్గతంగా కొనసాగుతున్న విచారణ?

ఏంటీ ఈ గిఫ్ట్ ప్యాక్..

సింగరేణికి సంబంధించిన పలు పనులను కొన్ని ఏజెన్సీలు చేపడుతున్నాయి. ఈ క్రమంలో టెండర్ల ప్రక్రియ నిర్వహించే ఓ బడా ప్రైవేట్ సంస్థ సింగరేణిలో కొందరు ఉద్యోగులపై తన అభిమానాన్ని ఘనంగా చాటుకున్నట్టు తెలుస్తోంది. తమకు మంచి లాభాలు వచ్చాయని, అందుకు ఉడతా భక్తిగా ఓ చిరు కానుక అంటూ ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్, ట్యాబ్.. మొత్తంగా రూ.లక్ష విలువైన గిఫ్ట్ ప్యాక్‌ను సిద్ధం చేయించింది. సదరు సంస్థ రూపొందించుకున్న జాబితాలో ఉన్న అధికారులకు వాటిని పంపిణీ చేసింది.

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రభుత్వ రంగ కార్పొరేట్ సంస్థల్లో మేటిగా కొనసాగుతున్న సింగరేణిలో రోజుకో అంశం వివాదాస్పదంగా మారుతోంది. తాజాగా 'గిఫ్ట్' ప్యాక్‌ల అంశం తెరపైకి వచ్చింది.

విజిలెన్స్ విచారణ ?

రూ.లక్ష విలువ చేసే గిఫ్ట్‌లు 100 నుంచి 120 వరకు సింగరేణిలో వివిధ హోదాల్లో పని చేసే కొందరు ఉద్యోగులకు అందాయనే ప్రచారం జోరందుకుంది. అయితే గిఫ్ట్ ప్యాక్‌ల రూపంలో మొత్తంగా రూ.1.20 కోట్ల నుంచి రూ.2 కోట్ల వరకు చేతులు మారాయనే ఆరోపణలు సైతం వెల్లువెత్తాయి. గిఫ్ట్‌లు అందజేసిన సంస్థకు అయాచితంగా లాభాలు వచ్చేలా నిబంధనల్లో మార్పులు చేశారా? అందుకు ప్రతిఫలంగా గిఫ్ట్‌లు అందాయా? గతంలో కొనసాగినట్టుగా ఇక ముందు కూడా 'సహాయ – సహకారాలు' అందివ్వాలనే 'గుడ్‌విల్'తో వీటిని ఇచ్చారా అనే గుసగుసలు హెడాఫీస్‌తో పాటు సింగరేణి పరిధిలో ఉన్న పది ఏరియాల్లోనూ వినిపిస్తున్నాయి. రోజులు గడిచేకొద్దీ ఈ వ్యవహారం చినికి చినికి గాలివానగా మారుతుండడంతో విజిలెన్స్ విభాగంతో అంతర్గతంగా విచారణ చేయిస్తున్నట్టు తెలుస్తోంది. విచారణకు సంబంధించిన వివరాల కోసం సంబంధిత అధికారిని ఫోన్‌లో సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

సంస్థ ప్రతిష్ట మసకబారేలా..

తెలంగాణ విద్యుత్ సంస్థల నుంచి రమారమీ రూ.30 వేల కోట్ల బకాయిలు సింగరేణికి రావాల్సి ఉంది. ఈ స్థాయి బకాయిలు ఉంటే ప్రభుత్వ రంగ కార్పొరేట్ సంస్థలు దివాళా అంచుకు చేరుతాయి. కానీ సింగరేణి ఇందుకు భిన్నంగా నిలిచింది. కొండలా బకాయిలు పెరిగిపోతున్నప్పటికీ పక్కా ప్రణాళిక, దానికి తగ్గ నిర్వహణ చాతుర్యం, ఆర్థిక క్రమశిక్షణ, నిబద్ధతతో కూడిన కార్మికులు, ఉద్యోగుల పనితీరు కారణంగా సంస్థ మనుగడ సాఫీగా సాగిపోతోంది. 'కాగ్' లాంటి చట్టబద్ధ సంస్థల రిపోర్టుల్లోనూ సింగరేణికి ప్రశంసలు దక్కాయి. కానీ ఇటీవల చోటుచేసుకుంటున్న పరిణామాలు సింగరేణి ప్రతిష్టను మసకబారుస్తున్నాయి. కారుణ్య నియామకాల్లో ఒక్కో ఫైలుకు రూ.6 నుంచి రూ.7 లక్షలు చేతులు మారుతున్నాయనే ఆరోపణలపై ఏసీబీ, సీఐడీ విభాగాలు తమ వంతు విచారణ చేపట్టాయి. ఈ అంశం ఓ కొలిక్కి రాకముందే గిఫ్ట్ ప్యాక్‌ల అంశం తెరపైకి వచ్చింది.

వెలుగులోకి ఇలా..

ఇంటర్నెట్ వినియోగం పెరిగిన తర్వాత వీడియో కాన్ఫరెన్స్‌లు, వాట్సాప్ గ్రూపుల్లో కార్యనిర్వహణ, ఈ మెయిల్స్‌లో ఉత్తర ప్రత్యుత్తరాలు వంటి పనులు పెరిగాయి. దీంతో ఆరు నెలల క్రితం మిడిల్ మేనేజ్‌మెంట్ నుంచి టాప్ మోస్ట్ అధికారుల వరకు సింగరేణి సంస్థ కొత్త ల్యాప్‌టాప్/డెస్కటాప్‌లు సమకూర్చింది. మలి దశలో తమకు కూడా కొత్త ల్యాప్‌టాప్/డెస్కటాప్‌లు వస్తాయనే నమ్మకంతో ఇతర ఉద్యోగులు ఉన్నారు. అయితే తమకు కొత్త ల్యాప్‌టాప్/డెస్కటాప్‌లు రాకుండా గతంలో ల్యాప్‌ట్యాప్/డెస్కటాప్‌లు అందుకున్న వారి చేతికే మళ్లీ కొత్తవి అందడంతో అనుమానాలు మొదలయ్యాయి. పైగా సదరు సంస్థ.. గిఫ్ట్‌లు అందుకున్న అధికారులను రిసీవ్డ్ అన్నట్టుగా సంతకాలు పెట్టమని ఒత్తిడి చేయడం అగ్నికి ఆజ్యం పోసినట్టయింది. దీనిపై ఎవరికి వారుగా కూపీ లాగితే కొత్త ల్యాప్‌టాప్/డెస్కటాప్‌లు సింగరేణి సంస్థ కొనిపెట్టినవి కాదని, సింగరేణి పనులు దక్కించుకున్న ఓ బడా సంస్థ తరఫున కొందరు ఉద్యోగులకే అందిన ప్రత్యేక కానుకలనే అంశం వెలుగు చూసింది.

సింగరేణిలో ప్రభుత్వ జోక్యాన్ని అరికట్టాలి

- అక్రమాలకు సహకరించకపోవడంతోనే డైరెక్టర్(పా) తొలగింపు
- ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిపై గత ప్రభుత్వం అజమాయిషీ, రాజకీయ జోక్యం, నిధుల దుర్వినియోగం కారణంగా గుర్తింపు సంఘం ఎన్నికల్లో బీఆర్ఎస్ అనుబంధ సంఘం నామరూపాల్లేకుండా పోయిందని.. ప్రస్తుతం అలా జరగకుండా ప్రభుత్వ, రాజకీయ జోక్యాన్ని అరికట్టాలని గుర్తింపు సంఘమైన ఏఐటీయూసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, రాజ్‌కుమార్ కోరారు. కొత్తగూడెంలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల డైరెక్టర్(పా) ఎస్.వీ.కే.శ్రీనివాస్‌ను తొలగించడం నిజాయితీ గల అధికారులను బెదిరించినట్టే అవుతుందని తెలిపారు. డైరెక్టర్(పా)పై తాము ఏ రోజూ ఫిర్యాదు చేయలేదని, ఈ విషయంలో జరుగుతున్న ప్రచారం అవాస్తమని అన్నారు. అక్రమ టెండర్లకు సహకరించకపోవడంతోనే డైరెక్టర్‌ను తొలగించినట్లు తెలుస్తోందని చెప్పారు. గతంలో ఇద్దరు చీఫ్ మెడికల్ ఆఫీసర్లను అకారణంగా విధుల్లో నుంచి తొలగించి లూప్‌లైన్‌లో పెట్టినా రూ.లక్షల వేతనం చెల్లించారని తెలిపారు. సింగరేణిలో రాజకీయ పెత్తనానికి నిరసనగా తమ యూనియన్ ఆధ్వర్యాన నిరసనలు చేపడుతామని వారు వెల్లడించారు. గత ప్రభుత్వం సంస్థకు రూ.25 వేల కోట్ల బకాయి ఉండగా, ఈ ప్రభుత్వం వచ్చాక అవి రూ.33వేల కోట్లకు చేరినందున వెంటనే చెల్లించాలన్నారు. అంతేకాక సింగరేణిలో రాజకీయ జోక్యం, పైరవీలపై ఏసీబీతో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. కాగా, ఈనెలాఖరులోగా 2023–24 ఆర్థిక సంవత్సరం నికర లాభా ల్లో వాటా ఇవ్వనుండగా, త్వరలోనే దీపావళి బోనస్‌పై చర్చ సాగనుందని తెలిపారు. గతంలో కంటే పెంచి సుమారు రూ.90వేల వరకు బోనస్ చెల్లించే అవకాశముందని వెల్లడించారు. ఈ సమావేశంలో నాయకులు శేషయ్య, వంగా వెంకట్, వీరస్వామి, మల్లికార్జున్, రమణమూర్తి, సందెబోయిన శ్రీనివాస్, క్రిస్టోఫర్ పాల్గొన్నారు.

రేపటి నుంచి సింగరేణి మెడికల్ బోర్డ్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి ప్రధానాస్పత్రిలో ఈనెల 19, 20 తేదీల్లో కార్పొరేట్ స్థాయి మెడికల్ బోర్డ్ నిర్వహించనున్నారు. సంస్థలో విధులు నిర్వర్తిస్తూ రెండేళ్ల సర్వీస్ ఉన్న వారి స్థానంలో వారసులకు ఉద్యోగావకాశం కల్పించేందుకు యాజమాన్యం ఈ మెడికల్ బోర్డ్ నిర్వహిస్తోంది. మొదటి రోజు గురువారం కార్మికులకు వైద్యపరీక్షలు నిర్వహించి పనిచేయడానికి శరీరం సహకరిస్తుందా, లేదా అని నిర్ధారిస్తారు. అనంతరం రెండో రోజైన 20వ తేదీన వైద్య నిపుణులు మరోమారు పరీక్షించి ఫలితం వెల్లడిస్తారు. కాగా, ఈ ప్రక్రియలో దళారులను నియంత్రించేందుకు నిఘా పటిష్టం చేశామని అధికారులు చెబుతున్నారు. ఎవరైనా ఫోన్ చేసి సహకరిస్తామని చెబితే 94911 44104 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఇక అన్‌ఫిట్ అయిన వారి వ్యాధుల వివరాలను నోటీస్ బోర్డ్‌లో ప్రదర్శించాలని కార్మికులు కోరుతుండగా యాజమాన్యం నుంచి స్పందన రాలేదు. కాగా, బోర్డ్‌కు హాజరుకానున్న అభ్యర్థుల వివరాలు ముందుగానే దళారుల చేతికి వస్తున్నాయనే ప్రచారం జరుగుతోంది.

అభివృద్ధిలో ముందంజ



పతాక వందనం చేస్తున్న మంత్రి తుమ్మల, కలెక్టర్, ఎస్పీ(ఇన్‌సెట్) మాట్లాడుతున్న తుమ్మల

- ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో హర్షాతిరేకాలు
- ప్రజాపాలన వేడుకల్లో మంత్రి తుమ్మల వెల్లడి
- వ్యవసాయ ప్రదర్శనకు అభినందన

సూపర్‌బజార్(కొత్తగూడెం): అభివృద్ధిలో రాష్ట్రం, జిల్లా ముందంజలో ఉన్నాయని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ప్రజాపాలన వేడుకల సందర్భంగా స్థానిక ప్రకాశం స్టేడియంలో మంగళవారం ఆయన జాతీయ పతాకం ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. 1948 సెప్టెంబర్ 17న తెలంగాణ ప్రాంతాన్ని నాటి హైదరాబాద్ సంస్థానం నుంచి భారత దేశంలో కలిపారని, 77వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా వేడుకలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధిస్తోందని చెప్పారు. తమ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ఆరు గ్యారంటీల అమలు హామీ మేరకు అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే రెండు హామీలను అమలు చేసి అంకితభావాన్ని చాటుకున్నామని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్య శ్రీ సేవలను రూ.10 లక్షలకు పెంచడం, రైతు రుణమాఫీ, గృహజ్యోతి, మహాలక్ష్మి వంటి పథకాలు అమలుతో ప్రజలు సంతోషంగా ఉన్నారని వివరించారు.

1.37 లక్షల మంది మహిళలు ఉచిత ప్రయాణం..

మహాలక్ష్మి పథకం ద్వారా జిల్లాలో ఇప్పటి వరకు 1,37,87,000 మంది మహిళలు బస్సుల్లో ఉచిత ప్రయాణం చేశారని, తద్వారా రూ. 71,91, 52,000 వారికి ఆదా అయ్యాయని తెలిపారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ ద్వారా మెరుగైన వైద్యం అందించేందుకు రూ.10 లక్షలకు పెంచామన్నారు. జిల్లాలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు 2,227 మందికి ఈ పథకం ద్వారా వైద్య సేవలు అందించామని చెప్పారు. 57,983 మంది రైతులకు రూ. 415,27,93,429 రుణమాఫీ చేసి అప్పుల బాధ నుంచి విముక్తి కల్పించామన్నారు. రైతుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు వారికి ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తూ రైతు బీమా అమలు చేస్తున్నామని చెప్పారు. జిల్లాలో 2023 ఆగస్టు 14 నుంచి ఈ ఏడాది ఆగస్టు 13 వరకు 761 మంది రైతులు మరణించగా 673 మంది రైతుల నామినీల ఖాతాల్లో రూ. 5 లక్షల చొప్పున రూ. 33.65 కోట్లు జమ చేశామని తెలిపారు. గృహజ్యోతి ద్వారా జిల్లాలో 6,12,384 మందికి లబ్ధి చేకూరుతోందన్నారు. రూ. 500కు గ్యాస్ పథకం కింద జిల్లాలో 1,47,294 మంది లబ్ధిదారులను గుర్తించామని, ఇప్పటి వరకు 3.52 లక్షల సిలిండర్లు సరఫరా చేసి రూ 9.13 లక్షల సబ్సిడీ చెల్లించామని చెప్పారు. ఈనెల 1న వచ్చిన భారీ వర్షాలతో మణుగూరు పట్టణం 30 ఏళ్ల చరిత్రలో కనీవినీ ఎరుగని జలప్రళయానికి గురైందని, అంజనాపురం, ఉల్వనూరులోనూ భారీ నష్టం వాటిల్లిందని వివరించారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, ఆస్తి, ప్రాణనష్టం జరుగకుండా చూడడం, గర్భిణులను, 130 మంది చిన్నారులను ఆశ్రమ పాఠశాలల్లో ఉంచి అందరికీ ఆహారం, వైద్య సేవలు అందించడంలో అధికారుల కృషి అభినందనీయమని అన్నారు. 2,144 వరద బాధిత కుటుంబాలకు ఆన్‌లైన్ ద్వారా రూ.16,500 చొప్పున అందించామని తెలిపారు. మారుమూల గ్రామాలు, నిరుపేదలు ఎక్కువగా నివసిస్తున్న ఈ జిల్లా సమగ్రాభివృద్ధికి నిత్యం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు, జిల్లా ప్రజలకు, ప్రభుత్వ అధికారులు, సిబ్బందికి, మీడియాకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం వ్యవసాయ స్టాళ్లను సందర్శించి నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్, ఇల్లెందు, అశ్వారావుపేట, భద్రాచలం ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, జారే ఆదినారాయణ, తెల్లం వెంకట్రావ్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, వ్యవసాయ, ఉద్యాన, ఇతర జిల్లా శాఖల అధికారులు పాల్గొన్నారు. కాగా, అంతకు ముందు మంత్రి తుమ్మల అమరవీరుల స్తూపం వద్ద నివాళులు అర్పించారు.



గాక్(స్వర్గ ఫలం) ఫ్రూట్స్ గురించి మంత్రికి వివరిస్తున్న ఉద్యాన అధికారులు



కూరగాయల ప్రదర్శనను తిలకిస్తున్న మంత్రి తుమ్మల

ఎట్టకేలకు ఫలితాలు విడుదల

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ జూలై 20, 21 తేదీల్లో నిర్వహించిన మొదటి నోటిఫికేషన్ రాత పరీక్ష ఫలితాలను మంగళవారం రాత్రి విడుదల చేసింది. 10 కేటగిరీల్లో 272 పోస్టుల భర్తీ కోసం పరీక్ష నిర్వహించగా 12 వేల మంది హాజరయ్యారు. దాదాపు రెండు నెలలుగా ఫలితాల కోసం అభ్యర్థులు ఎదురుచూస్తుండగా ఎట్టకేలకు ఫలితాలు వెలువడడంతో ఉత్కంఠకు తెరపడింది. గతంలో ఏ పరీక్ష జరిగినా అదే రోజు లేదా తెల్లవారి ఫలితాలు విడుదల చేసేవారు. అయితే గతంలో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా పరీక్షల నిర్వహణ బాధ్యతను రూ.4 కోట్లు వెచ్చించి ఎడ్‌సెల్ సంస్థకు అప్పగించింది. పూర్తి కంప్యూటర్ ఆధారంగా పరీక్షలు నిర్వహించిన సంస్థ.. ఫలితాల జాబితాను scclmines.com వెబ్‌సైట్‌లో పెట్టింది.

వినాయక.. వీడ్కోలిక..

- భద్రాద్రి గోదారి తీరాన ఘనంగా గణేష్ నిమజ్జనం
- వరద కారణంగా మంగళవారం ఆలస్యంగా ప్రారంభమైన నిమజ్జనం
- విగ్రహం మీద పడి గాయపడిన స్విమ్మర్ రాజేష్



నిమజ్జనం కోసం గోదావరి ఒడ్డున ఉన్న వినాయక విగ్రహాలు





గణనాథుల విగ్రహాలతో వాహనాలు

భద్రాచలంఅర్బన్ : భద్రాచలం గోదావరి నదిలో వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరుగుతోంది. ఇప్పటివరకు రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన దాదాపు 1000 పెద్ద విగ్రహాలు, మరో 1000 చిన్న విగ్రహాలను నిమజ్జనం చేసినట్లు అధికారులు తెలిపారు. గతేడాది నిమజ్జనానికి వచ్చి టేకులపల్లి మండలానికి చెందిన ఓ బాలుడు గోదావరి నదిలో గల్లంతై మృతి చెందాడు. దీంతో ఈ ఏడాది భక్తులను గోదావరి నదిలో స్నానాలకు కూడా అనుమతించలేదు. దీంతో గ్రామ పంచాయతీ అధికారులు కరకట్ట వద్ద షవర్‌ను ఏర్పాటు చేయగా, భక్తులు అక్కడే స్నానమాచరించారు.

ముందస్తు ప్రణాళికతో..

ఏఎస్పీ అంకిత్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నారు. పట్టణంలో కూడా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా ముందస్తు ప్రణాళికలతో చర్యలు చేపట్టారు. పట్టణంలో వాహనాల కోసం పార్కింగ్ స్థలాలను కేటాయించారు. విగ్రహాల తరలింపుపై అధికారుల రూట్ మ్యాప్ సిద్ధం చేయడంతో నిమజ్జన వేడుక సజావుగా సాగుతోంది. కాగా, బుధవారం కూడా నిమజ్జనాలు కొనసాగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

విగ్రహం పడి గాయం..

వినాయక విగ్రహాన్ని భక్తులు తెచ్చిన వాహనం నుంచి కిందకు దింపి, నిమజ్జనం కోసం జేసీబీలోకి ఎక్కిస్తున్న క్రమంలో విగ్రహం జారి రాజేష్ అనే స్విమ్మర్ కాలుపై పడింది. వెంటనే అధికారులు రాజేష్‌ను భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా ఎక్స్‌రే తీసిన వైద్యులు ఎడమ కాలు తొడ భాగం వద్ద ఎముక విరిగిందని, ఆపరేషన్ చేయాలని తెలిపారు. కాగా, అధికారులు సకాలంలో స్పందించలేదంటూ మిగిలిన స్విమ్మర్లు విధుల బహిష్కరణకు సిద్ధమై కాసేపు నిరసన తెలిపారు. అనంతరం అధికారులు వారితో చర్చించి ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకుంటామని చెప్పడంతో వారు శాంతించారు. కాగా, భద్రాచలం గోదావరి నదీ తీరాన భారీ వినాయక నిమజ్జనంలో ఇక్కట్లు ఎదురయ్యాయి. ప్రతీ ఏడాది ఈ సమస్య ఏర్పడుతున్నా అధికారులు తగు చర్యలు తీసుకోవడం లేదని భక్తులు ఆరోపించారు.

ఆలస్యంగా ప్రారంభం..

భద్రాచలం వద్ద గోదావరి నదిలో సోమవారం అర్ధరాత్రి 1 గంట నుంచి మంగళవారం ఉదయం 9 గంటల వరకు వినాయక విగ్రహాల నిమజ్జనానికి అంతరాయం ఏర్పడింది. గోదావరి ఉధృతి ఒక్కసారిగా తగ్గుముఖం పట్టడంతో లాంచీలు ఒడ్డున ఉండే అవకాశం లేకపోవడం, మరో పక్క ఒండ్రు మట్టిలో వాహనాలు దిగబడసాగాయి. దీంతో ఐటీసీ నుంచి నల్ల మొరం తరలించే క్రమంలో ఆలస్యం కాగా, దాదాపు 10 గంటల పాటు విగ్రహాల నిమజ్జనాన్ని నిలిపివేశారు. కాగా, మంగళవారం సుమారు 2వేల విగ్రహాలను నిమజ్జనం చేసినట్లు అధికారుల అంచనా.



నిమజ్జనం చేస్తున్న దృశ్యం

ఏడేళ్లుగా ఇక్కడే నిమజ్జనం



మేము ఏడేళ్లుగా వినాయక విగ్రహాలను భద్రాచలం గోదావరి నదిలోనే నిమజ్జనం చేస్తున్నాం. కమిటీ సభ్యులతో పాటు మా కుటుంబ సభ్యులం కూడా భద్రాచలం వచ్చి ఈ వేడుకలో పాల్గొంటున్నాం.

– శ్రీనివాస్, బాలగణేష్ యూత్, కొత్తగూడెం

ఎలాంటి ఆటంకం కలగలేదు



జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి విగ్రహాల నిమజ్జనానికి భారీగా తరలివచ్చారు. ముందస్తుగా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఎక్కడా అంతరాయం కలగలేదు.

– అంకిత్ కుమార్ సంక్వార్, ఏఎస్పీ

క్లుప్తంగా

గెస్ట్ లెక్చరర్ల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

భద్రాచలంటౌన్: భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కే.జాన్ మిల్టన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ రెండు అధ్యాపక పోస్టులు ఖాళీలు ఉన్నాయని, అర్హులైన అభ్యర్థులు ఈనెల 20న ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. 21న ఉదయం 10 గంటలకు జరిగే ఇంటర్వ్యూకు ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని, పీహెచ్‌డీ, నెట్, సెట్ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్ట్‌లో పీజీ 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులు పొందినా సరిపోతుందని వివరించారు.

గిరిజన విద్యార్థికి ఐటీడీఏ ప్రోత్సాహం



విద్యార్థిని బంధువులకు చెక్కు అందజేస్తున్న డేవిడ్ రాజ్

భద్రాచలంటౌన్: కొత్తగూడెంలోని గిరిజన సంక్షేమ శాఖ గురుకుల డిగ్రీ కళాశాల(బాలికలు)లో చదువుతూ ఐఐటీలో ర్యాంక్ సాధించిన వజ్ర మానసకు ఐటీడీఏ ఏపీఓ డేవిడ్‌రాజ్ మంగళవారం రూ. 50 వేల ప్రోత్సాహకం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మానస ఐఐటీ జేఏఎం పీజీ ఫిజిక్స్‌లో 5,042 ర్యాంకు సాధించి, రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో సీటు సాధించినట్లు తెలిపారు. ఐఐటీలో సీట్ సంపాదించి తోటి విద్యార్థినిలకు మార్గదర్శకంగా నిలవడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో అకౌంటెంట్ సంధ్య, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

జేఎల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఖుర్షీద్



ఖుర్షీద్ అహ్మద్



నాగేశ్వరరావు

కొత్తగూడెంఅర్బన్: జూనియర్ లెక్చరర్ల సంఘం జిల్లా అధ్యక్షులుగా ఎండి.ఖుర్షీద్ అహ్మద్ ఎన్నికయ్యారు. మూడేళ్ల పదవీ కాలానికి గాను మంగళవారం కొత్తగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జనరల్ సెక్రటరీగా నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్‌గా అక్తర్‌అలీ, ట్రెజరర్‌గా ఓ.పవన్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా శ్రీనివాసరావు, లేడీస్ సెక్రటరీగా నీరజ, స్టేట్ కౌన్సిలర్‌గా గోపాలకృష్ణ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా శేషబాబు వ్యవహరించగా, సీనియర్ ప్రిన్సిపాల్ కృష్ణవేణి పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో విద్యార్థి ప్రతిభ

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని త్రివేణి స్కూల్ విద్యార్థిని పారెల్లి భవ్యశ్రీ ఇన్‌స్పైర్ మనాక్ జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటింది. న్యూఢిల్లీలోని ప్రగతి మైదానంలో జరుగుతున్న జాతీయ స్థాయి పోటీల్లో భవ్య శ్రీ రూపొందించిన సీడ్స్ షోఇంగ్ మిషన్ ఎగ్జిబిట్ ప్రొఫెసర్ల, సైంటిస్టుల ప్రశంసలు అందుకుంది. దేశవ్యాప్తంగా 875 సైన్స్ ఎగ్జిబిట్లు రాగా, తెలంగాణ నుంచి 24 ఎగ్జిబిట్లు పాల్గొంటున్నాయి. కాగా భవ్యశ్రీతో పాటు గైడ్ టీచర్ నాగలక్ష్మిని పలువురు అభినందించారు.

రూ. లక్షకు గణేష్ కలశం కైవసం



కలశంతో రవీందర్

ఇల్లెందు: పట్టణంలోని స్టేషన్ బస్తీ శ్రీ లక్ష్మీ గణపతి వినాయక మండపంలో ఏర్పాటు చేసిన కలశాన్ని బరిగల రవీందర్ అనే వ్యక్తి రూ. లక్షకు కైవసం చేసుకున్నారు. మంగళవారం వేలం నిర్వహించగా పలువురు పోటీ పడ్డారు. చివరకు రూ. లక్షకు రవీందర్ సొంతం చేసుకున్నారు.

సెడిమెంటేషన్ వాటర్ ఫిల్టర్ పరిశీలన

చంద్రుగొండ : మండలంలోని తుంగారం, టీకులపల్లి పాఠశాలల్లో సెడిమెంటేషన్ వాటర్ ఫిల్టర్ పనితీరును అంతర్జాతీయ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.భాస్కర్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. వాష్ ప్రొగ్రాం కోఆర్డినేటర్ నిర్మలతో కలిసి ఆయన పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా సెడిమెంటల్ ఫిల్టర్ చేసిన నీటిని, పంప్ నీటిని విద్యార్థులతో తాగించి ఏ నీరు బాగుందని అడిగి తెలుసుకున్నారు. సెడిమెంటేషన్ నీరే బాగుందని చెప్పడంతో సర్వే నివేదికను కలక్టర్‌కు అందిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్లానింగ్ కో ఆర్డినేటర్ ఎస్ సతీష్‌కుమార్, ఎంఈఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.14,392



కలెక్టరేట్‌లో జాతీయ పతాకావిష్కరణ

పలు కార్యాలయాల్లో జెండాలు ఎగురవేసిన అధికారులు



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పాటిల్



ఎస్పీ కార్యాలయంలో రోహిత్‌రాజ్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా ఐడీఓసీలో కలెక్టర్ జితేష్ వి పాటిల్ మంగళవారం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జెడ్పీ, ఎస్పీ కార్యాలయంలో..

కొత్తగూడెంటౌన్: తెలంగాణ ప్రజాపాలన వేడుకల్లో భాగంగా జిల్లా పరిషత్ కార్యాలయంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ రోహిత్ రాజ్, అటవీ శాఖ కార్యాలయంలో డీఎఫ్ఓ కిష్టాగౌడ్ జాతీయ జెండాలు ఎగురవేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎంతో మంది త్యాగాలతో హైదరాబాద్ నిజాం సంస్థానం నుంచి తెలంగాణ భారతదేశంలో విలీనం అయిందని తెలిపారు. 1948 సెప్టెంబర్ 17న తెలంగాణ ప్రజలకు స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. ఆయా కార్యక్రమాల్లో అడిషనల్ ఎస్పీ (ఆపరేషన్స్) పరితోష్ పంకజ్, కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, ఏఓ జయరాజు, డీసీఆర్బీ సీఐ శ్రీనివాస్, ఎస్పీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, సీఐలు కరుణాకర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ కార్యాలయంలో

భద్రాచలం: భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణకు స్వాతంత్ర్యం సిద్ధించి నేటికి 76 ఏళ్లు పూర్తయి 77వ సంవత్సరంలో అడుగు పెడుతున్నామని తెలిపారు. స్వీయ అస్తిత్వం కోసం ఉద్యమించి, స్వరాష్ట్రంగా అవతరించిన తెలంగాణలో గిరిజన సంక్షేమం కోసం ఐటీడీఏలు విశేష కృషి చేస్తున్నాయని చెప్పారు. కొండ కోనల్లో నివసించే ఆదివాసీలకు, గిరిజన విద్యార్థులకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని, విద్య ,వైద్యం, మౌలిక వసతులు, గిరిజన రైతులకు రుణాలు, పథకాలు, గిరిజన యువత, మహిళలకు స్వయం ఉపాధి పథకాలు, సబ్సిడీపై ట్రైకార్ రుణాలు, మత్స్యకారులకు సొసైటీ రుణాలు, పోడు భూములకు పట్టాలు తదితర ప్రయోజనాలు కల్పించడంలో ఐటీడీఏ అగ్ర భాగాన ఉందని వివరించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు తానాజీ, శ్రీనివాస్, ఉదయ్ కుమార్, రమణయ్య, ఆదినారాయణ, హరీష్, ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ది దుర్మార్గ పాలన

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు
- తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం



మాట్లాడుతున్న రేగా కాంతారావు, పక్కన నాయకులు

మణుగూరు రూరల్ : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గపు పాలన సాగిస్తోందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆరోపించారు. సచివాలయంలో తెలంగాణా తల్లి విగ్రహం కాకుండా రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తూ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు మంగళవారం అంబేద్కర్ సెంటర్‌లోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహానికి రేగా పాలాభిషేకం చేసి పూలమాల వేశారు. అనంతరం మాట్లాడుతూ.. సచివాలయంలో రాజీవ్‌గాంధీ విగ్రహ ఏర్పాటును తీవ్రంగా ఖండించారు. ప్రజాపాలన పేరుతో రాష్ట్ర ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మభ్యపెట్టి మోసం చేస్తోందన్నారు. కేసీఆర్ నాయకత్వంలో కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణా అస్తిత్వం కోల్పోయేలా అవమానపరుస్తోందని విమర్శించారు. తెలంగాణాకు ఏమి చేయని రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఏంటని ప్రశ్నించారు. తెలంగాణ తల్లికి అవమానపరిచేలా ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సొసైటి చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అడపా అప్పారావు, మండల అధ్యక్షుడు ముత్యంబాబు, నాయకులు బొలిశెట్టి నవీన్, వట్టం రాంబాబు, తాళ్లపల్లి యాదగిరిగౌడ్, ముద్దంగుల కృష్ణ, వీరమనేని చెన్నకేశవులు, అక్కి నర్సింహరావు, అవుల నర్సింహరావు, ప్రభుదాస్, సురేష్, రమాదేవి, బొగ్గం రజిత, విజయ, సరిత రవిప్రసాద్ పాల్గొన్నారు.

సాగునీటి కోసం రైతుల ‘శ్రమ’



ఇసుక బస్తాలతో కట్ట నిర్మిస్తున్న రైతులు

అశ్వారావుపేటరూరల్: పొలాల చెంతనే సాగునీటి ప్రాజెక్టు ఉన్నా.. ప్రస్తుతం ఆ నీరందే పరిస్థితి లేదు. దీంతో సాగు చేస్తున్న పంటలకు నీరు లేక రైతులు ఇక్కట్లు పడుతున్నారు. ఈ సమస్య నుంచి బయటపడేందుకు మంగళవారం కొందరు ఆయకట్టు రైతులు శ్రమదానం చేశారు. మండలంలోని గుమ్మడవల్లి సమీపంలోగల పెదవాగు ప్రాజెక్టుకు గత జూలై 18న భారీగా వరద రావడంతో ప్రధాన ఆనకట్టకు భారీగా గండ్లు పడిన సంగతి తెలిసిందే. కాగా, ఈ సీజన్‌కే సాగు నీరు(తెలంగాణ వరకు) అందిస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలికంగా రింగ్‌బండ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయగా, యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టారు. కానీ ఈ పనులు పూర్తయిన ఈనెల ఒకటో తేదీనే భారీ వర్షం, వరద రావడంతో రింగ్‌బండ్ 30 మీటర్ల మేర కొట్టుకుపోయింది.

ఎడమ కాల్వ వైపు మళ్లించేలా..

పెదవాగు ప్రాజెక్టు కింద వడ్డెర రంగాపురం, కోయ రంగాపురం గ్రామాల్లో రైతులు పంటలు సాగు చేస్తున్నారు. ఈ పంటలకు ప్రస్తుతం సాగునీరు అవసరం కాగా, పెదవాగు ప్రాజెక్టు నుంచి సాగునీరు వచ్చే పరిస్థితి లేదు. దీంతో ఆయా గ్రామాలకు చెందిన కొందరు రైతులు సాగునీరు ఎడమ కాలువ వైపు మళ్లించేందుకు ఇసుక బస్తాలతో తాత్కాలికంగా అడ్డుకట్ట నిర్మించుకున్నారు. ఇసుక బస్తాల కట్టతో ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరదనీరు నిల్వ ఉండి, ఎడమ కాలువ ద్వారా ప్రవహించేలా చిన్నపాటి కాలువ ఏర్పాటు చేశారు. ఈ కాలువ ద్వారా ప్రాజెక్టు ఎడమ కాలువలోకి వరద నీరు ప్రవహించే విధంగా మళ్లించారు. కాలువ ద్వారా వచ్చే సాగునీరును పొలాల వద్ద ఇంజన్లు, ఇతర మార్గాల్లో మళ్లించి పంటలను కాపాడుకునేందుకు అన్నదాతలు శ్రమించారు.

ఒకరికి బదులు మరొకరు పరీక్ష..

పదో తరగతి విద్యార్థినికి నాలుగేళ్ల జైలు

కొత్తగూడెంటౌన్: 2016లో నిర్వహించిన పదో తరగతి పరీక్షల్లో అసలు విద్యార్థినికి బదులు మరో బాలిక పరీక్ష రాసిన కేసులో కొత్తగూడేనికి చెందిన రాచబంటి శేషమణి అనే నాటి విద్యార్థినికి నాలుగేళ్ల జైలుశిక్ష విధిస్తూ కొత్తగూడెం రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కె.సాయిశ్రీ మంగళవా రం తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి.. కొత్తగూడెంలోని ఎస్ఆర్‌డీజీ పాఠశాల రూమ్ నంబర్ 19లో శేషమణికి బదులు మరో మైనర్ బాలిక పరీక్ష రాస్తుండగా ఇన్విజిలేటర్ బానోతు రమేష్‌కు అనుమానం వచ్చింది. దీంతో ఆయన హాల్ టికెట్‌ను పరిశీలించగా శేషమణికి బదులు మరో అమ్మాయి పరీక్షలు రాస్తున్నట్లు గుర్తించి హాల్ టికెట్‌కు ఆన్సర్ షీట్ జత చేసి చీఫ్ సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన విచారించగా శేషమణితో పాటు బాలిక కూడా నేరాన్ని అంగీకరించారు. దీంతో కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఐదుగురు సాక్షులను విచారించగా శేషమణిపై నేరం రుజువు కావడంతో ఒక సెక్షన్‌లో ఒక ఏడాది, మరోక సెక్షన్‌లో మూడేళ్లు.. మొత్తం నాలుగేళ్ల జైలుశిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.

ప్రేమ పేరుతో మోసం కేసులో..

ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన కేసులో కొత్తగూడెం గాజులరాజం బస్తీకి చెందిన మహ్మద్ అబ్దుల్ మాలిక్‌కు రూ.5వేల జరిమానా లేదా రెండు నెలల జైలుశిక్ష విధిస్తూ మెజిస్ట్రేట్ కె.సాయిశ్రీ మంగళవారం తీర్పు చెప్పారు. కొత్తగూడెం కూలీలైన్‌కు చెందిన ఓ యువతి, గాజుల రాజం బస్తీకి చెందిన మహ్మద్ అబ్దుల్ మాలిక్ ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిని గర్భవతిని చేశాడు. ఆ తర్వాత పెళ్లి చేసుకుందామని అడిగితే అతడు ఒప్పుకోకుండా ‘నీ ఇష్టం వచ్చినట్టు చేసుకో’ అంటున్నాడని సదరు యువతి 2012 ఏప్రిల్ 5న త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఏడుగురు సాక్షులను విచారించగా అబ్దుల్ మాలిక్‌పై నేరం రుజువు కావడంతో జడ్జి పైవిధంగా తీర్పు చెప్పారు.

ఎస్‌ఐని వాహనంతో ఢీ కొట్టిన కేసులో ముగ్గురికి..

విధుల్లో ఉన్న అశ్వారావుపేట ఎస్ఐ మధుప్రసాద్‌ను ద్విచక్ర వాహనంతో ఢీకొట్టి గాయపరిచిన గుజ్జు భానుకిరణ్, సబలం దిలిప్‌కుమార్, కలుమ హర్షవర్ధన్‌లకు ఏడాది జైలుశిక్షతో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ కొత్తగూడెం ప్రిన్సిపల్ సీనియర్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి భానుమతి మంగళవారం తీర్పు చెప్పారు. 2021 ఫిబ్రవరి 14న ఎస్ఐ మధుప్రసాద్ నల్లబాడు – ఊట్లపల్లి మార్గంలో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఏపీలోని ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలానికి చెందిన భానుకిరణ్, దిలీప్‌కుమార్ తోపాటు పోలవరం మండలానికి చెందిన హర్షవర్ధన్ ఒకే బైక్‌పై వస్తూ ఎస్ఐని ఢీకొట్టి గాయపరిచారు. దీంతో ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా, నిత్యం తమకు ఫైన్ వేస్తున్నారని, అందుకే ఇలా చేశామని చెప్పారు. ఈ మేరకు అశ్వారావుపేట పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. దర్యాప్తు అనంతరం పోలీసులు కోర్టులో చార్జిషీట్‌ను దాఖలు చేశారు. తొమ్మిది మంది సాక్షులను విచారించిన జడ్జి ముగ్గురిపై నేరం రుజువు కావడంతో ఏడాది జైలుశిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

అటవీ అధికారులు - రైతుల మధ్య పోడు వివాదం

దుమ్ముగూడెం : మండలంలోని గడ్డోరగట్ట గ్రామంలో పోడుసాగుదారులు – అటవీ అధికారులు మధ్య మంగళవారం వాగ్వాదం చోటుచేసుకుంది. గడ్డోరగట్ట గ్రామ పరిధిలో గల అటవీ ప్రాంతంలో అధికారులు వేసిన ప్లాంటేషన్ మొక్కలను సుమారు ఎకరం వరకు గ్రామస్తులు తొలగించారు. దీంతో ఎఫ్‌డీఓ సుజాత, ఎఫ్ఆర్ఓ కమల సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలిస్తుండగా ఇరు వర్గాల మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో అటవీ శాఖ అధికారులు పోలీసులకు సమాచారం అందజేయగా సీఐ అశోక్‌కుమార్ సిబ్బందితో కలిసి వెళ్లి పరిశీలన చేశారు. ఈ ఘటనపై అటవీ శాఖ అధికారులు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

తమిళనాడులో జిల్లా విద్యార్థి మృతి

- కన్యాకుమారిలో బీటెక్ చదువుతున్న నలుగురు విద్యార్థులు
- బీచ్‌లో విహారయాత్రకు వెళ్లగా.. నీట మునిగి ఒకరు మృతి, మరొకరి పరిస్థితి విషమం

సుజాతనగర్/పాల్వంచ: పొరుగు రాష్ట్రంలో బీటెక్ చదువుతున్న జిల్లాకు చెందిన విద్యార్థులు విహార యాత్రకు వెళ్లగా విషాదం చోటుచేసుకుంది. నలుగురిలో ఒకరు మృతి చెందగా, ఇంకొకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు మంగళవారం సాయంత్రం కుటుంబీకులకు సమాచారం అందింది. జూలూరుపాడు, పాల్వంచకు చెందిన ఇద్దరు, సుజాతనగర్‌కు చెందిన మరో ఇద్దరు తమిళనాడు రాష్ట్రం కన్యాకుమారిలోని జాయ్ యూనివర్సిటీలో బీటెక్ చదువుతున్నారు. మరికొందరు విద్యార్థులతో కలిసి కళాశాలకు 20 కి.మీ దూరాన ఉన్న కన్యాకుమారి బీచ్‌కు విహారయాత్ర నిమిత్తం మంగళవారం వెళ్లారు. అయితే, అలల ఉధృతి కారణంగా పాల్వంచకు చెందిన బత్తినేని జయంత్ సాయి(18), సుజాతనగర్‌కు చెందిన మండవ సాయి తరుణ్ నీట మునిగారు. ఇందులో జయంత్ సాయి మృతి చెందగా.. నీళ్లు మింగిన సాయి తరుణ్ పరిస్థితి విషమంగా మారింది. ఆయనను కన్యాకుమారిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా, జయంత్ సాయి తండ్రి సురేష్ ఖమ్మంకు చెందిన ఓ ఫెస్టిసైడ్ సంస్థలో కలెక్షన్ ఏజెంట్‌గా పనిచేస్తూ పాల్వంచలో నివాసముంటున్నాడు. ఉన్నత చదువులు చదివేందుకు వెళ్లిన జయంత్ మృతి చెందడం, ఇంకొకరి పరిస్థితి విషమంగా ఉందని తెలియడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు.

‘శ్రీరామ టెంపుల్’ ఆధ్వర్యంలో రామయ్య కల్యాణం

వివాదాల నడుమ ముగిసిన వేడుక



శ్రీ సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలంటౌన్: భద్రాచలంలో ప్రపంచ శాంతికి ఖగోళ యాత్ర ముగింపు సందర్భంగా శ్రీరామ టెంపుల్ ఆఫ్ యూఎస్ఏ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన శ్రీ సీతారాముల కల్యాణం వేడుక వివాదాల నడుమ ముగిసింది. స్థానిక శ్రీవాసవి కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌లో అర్చకులు పద్మనాభాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణ తంతు సాగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకను తిలకించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. కాగా, ఈ కల్యాణ వేడుకపై భద్రాచలం దేవస్థాన ఈఓ రమాదేవి తీవ్ర ఆరోపణలు చేశారు. భద్రాచలం పేరుతో పాటు స్వామివారి మూలవిరాట్ ఫొటోను సైతం తొలగించాలని ఆమె డిమాండ్ చేశారు. భద్రాద్రి రామయ్య కల్యాణం పేరుతో భారీగా విరాళాలు సేకరించారని ఉన్నతాధికారులకు సైతం పిర్యాదు చేశారు. అయితే నిర్వాహకులు భద్రాద్రి పేరును తొలగించి శ్రీసీతారాముల మూలవిరాట్ ఫొటోలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఈ విషయమై దేవదాయ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన ఈఓ రమాదేవి ఏ విధంగా స్పందిస్తారనేది ఆసక్తిగా మారింది.

రామాలయ అర్చకులకు షోకాజ్ నోటీసులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ప్రధాన అర్చకుడు పొడిచేటి సీతారామానుజాచార్యులు, ముఖ్య అర్చకులు పొడిచేటి సీతారాంలకు ఈఓ రమాదేవి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఓ ప్రైవేట్ సంస్థ ఖగోళ యాత్ర పేరుతో భద్రాచలంలో చేపట్టిన కల్యాణంలో దేవాదాయ శాఖ నిబంధనలకు విరుద్ధంగా పాల్గొన్నారనే కారణంతో ఆ ఇద్దరికీ నోటీసులను జారీ చేశారు. ఇప్పటికే ఆ సంస్థ ఆలయ ప్రతిష్టకు భంగం కలిగించేలా స్వామివారి మూలమూర్తుల ఫొటోలను వాడుకుంటూ భారీగా విరాళాలు సేకరించారనే ఆరోపణలు వచ్చాయి. దీనిపై ఈవో విలేకరుల సమావేశంలో ఖండించడంతో పాటు సంస్థ ప్రతినిధులపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు సైతం చేశారు. ఈ తరుణంలో అర్చకులు సెలవు పెట్టి ఆ సంస్థ కార్యక్రమాల్లో పాల్గొనడాన్ని దేవాదాయ శాఖ అధికారులు సీరియస్‌గా తీసుకున్నట్లు తెలిసింది. ఆ అర్చకుల వివరణ అనంతరం శాఖాపరమైన విచారణ ఉంటుందని, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే కఠిన చర్యలు ఉంటాయని అధికారులు చెబుతున్నారు.

ఒక్కొక్కరికి రెండు నోటీసులు..

ఇద్దరు అర్చకులకు ఈఓ రెండేసి షోకాజ్ నోటీసులు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. లైంగికంగా వేధిస్తున్నారంటూ ప్రధాన అర్చకుడు పొడిచేటీ సీతారామానుజాచార్యులుపై ఆయన కోడలు తాడేపల్లిగూడెం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఆయనతో పాటు ముఖ్య అర్చకుడు సీతారాంపై కేసు నమోదైంది. అయితే ఈ విషయం ఆలయ అధికారులకు సమాచారం ఇవ్వలేదనే కారణంతో పాటు ప్రైవేట్ సంస్థ కార్యక్రమాల్లో పాల్గొనడంతో రెండు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

విద్యార్థుల ఆటోను ఢీ కొట్టిన కారు

- ఓ బాలుడు మృతి, మరో ఐదుగురికి గాయాలు
- ఆటో డ్రైవర్ పరిస్థితి విషమం



మృతుడు ఈశ్వర్ (ఫైల్)



ప్రమాద స్థలం వద్ద పడిపోయిన విద్యార్థులు



నుజ్జునుజ్జయిన ఆటో

ములకలపల్లి : మద్యం మత్తులో కారు నడుపుతూ ఆటోను ఢీకొట్టిన ఘటనలో ఓ బాలుడు మృతి చెందగా, మరో ఐదుగురు విద్యార్థులు గాయపడ్డారు. ఆటో డ్రైవర్ పరిస్థితి విషమంగా మారింది. వివరాలిలా ఉన్నాయి.. మండల పరిధిలోని ఉమ్మడి పూసుగూడెం పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల చిన్నారులు పాల్వంచలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో చదువుతున్నారు. వీరంతా సుబ్బనపల్లికి చెందిన అట్టికేటి ప్రవీణ్ ఆటోలో రోజూ వెళ్తుంటారు. మంగళవారం సాయంత్రం బడి నుంచి తిరిగి వస్తుండగా పాతూరు సమీపంలో వీరి ఆటోను ఎదురుగా రాంగ్‌రూట్‌లో వచ్చిన కారు బలంగా ఢీ కొట్టింది. దీంతో ఆటో నుజ్జునుజ్జయి పక్కనే ఉన్న గోతిలో ఎగిరిపడింది. ఆటోలోని చిన్నారులంతా రోడ్డుపై పడిపోగా, వారి రోదనలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. సమీపంలో ఉన్నవారు విద్యార్థులను పాల్వంచ ఆస్పత్రికి తరలించారు. అయితే వీకే రామవరం గ్రామానికి చెందిన లైన్‌మెన్ ఉపేందర్ కుమారుడు రచ్చ ఈశ్వర్ (12) ఆస్పత్రికి వెళ్లక ముందే మృతిచెందాడు. ఈశ్వర్ సోదరుడు యశ్వంత్‌కు స్వల్ప గాయాలు కావడంతో కొత్తగూడెం తరలించారు. ఆటో డ్రైవర్ ప్రవీణ్ సోదరుడి కుమారుడు తేజాక్షిత్, కూతురు సాత్విక, వీకే రామవరం మాజీ సర్పంచ్ కుంజా భాస్కర్ కుమారుడు మోక్షిత్‌ను ఖమ్మం ఆస్పత్రికి తీసుకెళ్లారు. సుబ్బనపల్లికి చెందిన ఊట్ల శ్రీధర్ కూతురు జ్ఞానచరితకు పాల్వంచలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. కాగా, ఆటో డ్రైవర్ ప్రవీణ్‌కు తీవ్ర గాయాలు కావడంతో కోమాలోకి వెళ్లాడు. మృతుడి, క్షతగాత్రుల కుటుంబీకుల రోదనలతో పాల్వంచ ఆస్పత్రి వద్ద విషాదం అలుముకుంది. పాల్వంచ ఎస్సై సుమన్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేయగా, సీఐ ప్రవీణ్ పరిస్థితిని సమీక్షించారు. ములకలపల్లి తహసీల్దార్ గుడ్ల పుల్లారావు, ఆర్ఐలు భద్రు, సత్యావతి ఆస్పత్రికి వెళ్లి వివరాలు సేకరించారు. మద్యం మత్తులో తూలుతూ కారు నడుపుతున్న కంటి శేఖర్ రావును ములకలపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఎమ్మెల్యే కూనంనేని పరామర్శ

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పాల్వంచ ఏరియా ఆస్పత్రికి చేరుకుని క్షతగాత్రుల కుటుంబీకులను పరామర్శించారు. గాయాలపాలైన చిన్నారులను ఓదార్చారు. ప్రమాద వివరాల గురించి సీఐ వినయ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు



అదృశ్యమైన కొంగా నవీన్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఏఎంసీ కాలనీకి చెందిన ఓ యువకుడు అదృశ్యమైన ఘటనపై మంగళవారం పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై విజయలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఏఎంసీ కాలనీకి చెందిన కొంగా నవీన్ (28) స్థానిక గోపీ గ్రాఫిక్స్ సెంటర్‌లో స్టిక్కరింగ్ పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి 10 గంటలకు బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నవీన్ ఇంటి నుంచి బయటకు వెళ్లినప్పుడు ఎరుపు రంగ టీషర్ట్ ధరించి ఉన్నాడని కుటుంబసభ్యులు తెలిపారు.

ఆర్టీసీ బస్సులో గంజాయి రవాణా...

చంద్రుగొండ : కొత్తగూడెం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో తరలిస్తున్న గంజాయిని పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఆ బస్సు భద్రాచలం నుంచి గుంటూరు వెళ్తుండగా సారపాక వద్ద నలుగురు వ్యక్తులు ఎక్కారు. వారు గంజాయి రవాణా చేస్తున్నారనే సమాచారం అందుకున్న ఎస్ఐ స్వప్న బస్సును చంద్రుగొండలో ఆపి తనిఖీ చేయగా వారి వద్ద ఉన్న సంచుల్లో సుమారు 10 కేజీల గంజాయి లభించినట్లు సమాచారం. దీంతో వారిని అదుపులోకి తీసుకున్న విచారిస్తున్నట్లు తెలిసింది.

ఇద్దరు పేకాటరాయుళ్ల అరెస్ట్

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని పునుకుల గ్రామ శివారులోని ముత్యాలమ్మ గుడి వద్ద పేకాట శిబిరంపై రూరల్ ఎస్ఐ.బి.సురేశ్ మంగళవారం దాడిచేశారు. అక్కడ పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడి చేయగా ఐదుగురిలో ముగ్గురు పరారయ్యారు. కె.రమేష్, కిరణ్ అనే ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1000 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ.. కేసు నమోదు

కరకగూడెం: మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన ఇరువర్గాలపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. ఎస్సై రాజేందర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వంగరి సతీష్, అత్తె విష్ణు కుటుంబాల మధ్య పాత కక్షల వివాదంలో సోమవారం రాత్రి ఘర్షణ జరిగింది. ఈ మేరకు ఇరువర్గాలు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

కరకగూడెం: క్షణికావేశంలో ఓ వ్యక్తి తీసుకున్న నిర్ణయం ఆ కుటుంబాన్ని రోడ్డున పడేసింది. మండల పరిధిలోని అశ్వాపురంపాడుకు చెందిన కోవాసి సురేష్(35)కు, భార్య గీతకు మధ్య మంగళవారం రాత్రి గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన సురేష్ పురుగుల మందు తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు 108లో కరకగూడెం పీహెచ్‌సీకి, అక్కడి నుంచి మణుగూరు ఆస్పత్రికి తరలిస్తుండగా గోపాలరావుపేట వద్దకు చేరుకోగానే మృతిచెందాడు. కాగా మృతుడి భార్య నాలుగు నెలల గర్భవతి, వీరికి ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్దదిక్కు మరణంతో వారంతా దిక్కులేని వారయ్యారు.

పద్మశ్రీ అవార్డు గ్రహీత సచ్చిదానందశాస్త్రి కన్నుమూత



నగరంపాలెం: ప్రముఖ హరికథా భాగవతార్, పద్మశ్రీ అవార్డు గ్రహీత కోట సచ్చిదానందశాస్త్రి (90) కన్నుమూశారు. వృద్ధాప్యంతో బాధపడుతోన్న ఆయన సోమవారం రాత్రి గుంటూరు అమరావతిరోడ్‌లోని ఆయన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య సీతాదేవి, కుమారులు శివశాస్త్రి, శ్రీరామచంద్రమూర్తి, కృష్ణ మోహన్, కుమార్తె దుర్గవెంకటసుబ్బలక్ష్మీ ఉన్నారు. ఆయన భార్య గతంలోనే చనిపోయారు. సోమవారం సాయంత్రం అంత్యక్రియలను గుంటూరు బొంగరాల బీడు శ్మశాన వాటికలో నిర్వహించినట్లు పెద్ద కుమారుడు శివశాస్త్రి తెలిపారు. సచ్చిదానందశాస్త్రి గతేడాది జనవరిలో పద్మశ్రీ అవార్డు, 2022లో సంగీతనాటక అకాడమి అవార్డు, 2023 నవంబర్‌లో వైఎస్సార్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు, 2015లో హంసా పురస్కారం, 2009లో కొప్పరపు కవుల పురస్కారాలను అందుకున్నారు. గతంలో పలువురు ముఖ్యమంత్రుల నుంచి అవార్డులను స్వీకరించారు.

ఆయన కథాగానం.. జనరంజకం..

చిన్న పిట్టకథలు, చతురోక్తులతో 'కోట'కథాగానం జనరంజకంగా సాగేది.. మధూకరం చేసుకుంటూ వేదవిద్యను నేర్చుకుని, హరికథను సాధన చేసి, ప్రఖ్యాత హరికథకుడిగా 'కోట'ఎదిగారు. హరికథకు తొలిసారిగా పద్మశ్రీ అందించిన తొలి భాగవతార్‌గా కీర్తిని పొందారు. రామాయణ, భారత, భాగవతాలను గానం చేస్తూ విశేష ప్రాచుర్యం కల్పించారు. 7 దశాబ్దాలుగా దేశవిదేశాల్లో వేలాది ప్రదర్శనలిచ్చారు. శతాధిక కథావారసులను తీర్చిదిద్దారు. 8 పదుల వయసులోనూ కథాగానం చేస్తూ వచ్చారు. సచ్చిదానంద శాస్త్రి స్వస్థలం ప్రకాశం జిల్లా అద్దంకి. 57 ఏళ్ల క్రితం గుంటూరు చేరుకుని అక్కడే స్థిరపడ్డారు. ఆసక్తి కలిగిన శిష్యులకు శిక్షణనిస్తూ వచ్చారు. చతురోక్తులు, సరస సంభాషణలతో ప్రేక్షకుల మనసు తనపై లగ్నమయ్యేవరకు కాలక్షేపం చేసి, కథాంశంతో హరికథను ఆరంభించేవారు. భక్తిరస సినిమా పాటలు, సున్నితమైన హాస్య సంభాషణలను చొప్పించటం, నృత్యాలు, అభినయం, నాటకీయతను చేర్చి హరికథను జనరంజకం చేశారు. ఈ ప్రత్యేకతతో వారికి ఎంతో డిమాండ్ ఏర్పడింది. ఒక్కరోజు విరామం లేకుండా హరికథలు చెప్పేవారు. బొత్తిగా చదువులేని వారికీ విద్య నేర్పారు. ఎలాంటి ప్రతిఫలం తీసుకోలేదు. వారంతా హరికథను వృత్తిగా స్థిరపడినవారే.



చూడ్డానికి ఏవో గ్రహాంతర జీవుల్లా కనిపిస్తున్నాయి కదూ.. కానీ ఇవన్నీ ఈ గ్రహంలోని జీవులే. మనకు బాగా తెలిసినవే. ఇవి చేపలు. గుడ్డు నుంచి బయటకువచ్చాక.. చేప పిల్లలు యోక్ సాక్(పచ్చసొన)కు అతుక్కుని ఉన్న దశలో తీసిన చిత్రమిది. ఈ ఫొటో ఓషన్ ఫొటోగ్రాఫర్ ఆఫ్ ద ఇయర్ పోటీల్లో ఓషన్ పోర్ట్‌ఫోలియో విభాగంలో విజేతగా నిలిచింది. ఈ చిత్రాన్ని కెనడాకు చెందిన షేన్ గ్రాస్ అనే ఫొటోగ్రాఫర్ తీశారు. గుడ్డు నుంచి బయటకువచ్చాక పిల్లలు తొలి దశలో ఈ పచ్చసొననే కరిగించుకుని ఆహారంగా తీసుకుంటాయట.

డిటోనేటర్లతో చెరువు మత్తడి పేల్చివేత

సగానికి పైగా నీరు వృథా



వృథాగా పోతున్న నీరు

చెన్నూర్: మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణంలోని శనగకుంట చెరువు మత్తడిని సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు డిటోనేటర్లతో పేల్చివేశారు. దీంతో మత్తడి పూర్తిగా ధ్వంసమై చెరువులోని సగానికి పైగా నీరంతా వృథాగా పోయింది. ఈ సంఘటన చెన్నూర్‌లో సంచలనం సృష్టించింది. జాతీయ రహదారి పక్కనే ఉన్న మత్తడి పేల్చివేత శబ్దం సమీప ప్రాంత ప్రజలకు వినిపించింది. గణేశ్ నిమజ్జనం ఉండటంతో బాణసంచా పేల్చి ఉంటారని భావించారు. రాష్ట్రంలో ఓ వైపు చెరువుల పరిరక్షణకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా హైడ్రాను తీసుకొచ్చి ఆక్రమణలను తొలగిస్తోంది. మరోవైపు ఆయకట్టుకు నీరందించే చెరువు మత్తడిని డిటోనేటర్లతో పేల్చివేయడం చర్చనీయాంశంగా మారింది. సుమారు 50 ఎకరాలకు నీరందించే చెరువు నీరు వృథాగా పోవడంతో రైతులు, చెరువులో చేపలు పట్టి జీవించే మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. నీటిపారుదల శాఖ ఈఈ విష్ణుప్రసాద్, డీఈ వేణుగోపాల్, ఏఈ తిరుపతి, స్థానిక సీఐ రవీందర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. స్థానిక ఎమ్మెల్యే వివేక్ ఆదేశాల మేరకు ఇసుక బస్తాలు వేసి నీరు వృథా పోకుండా చర్యలు చేపడతామని విష్ణుప్రసాద్ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ రవీందర్ వెల్లడించారు. అన్ని కోణాల్లో కేసు దర్యాప్తు చేస్తున్నామని, నిందితులను త్వరలోనే పట్టుకుంటామన్నారు.

ఆ శిక్ష.. ఐపీఎస్‌లపై కక్ష!

తనను అరెస్టు చేసి జైలులో పెట్టడాన్ని మనసులో పెట్టుకున్న బాబు

అధికారులను అక్రమ కేసులతో వేధిస్తున్న ఏపీ ప్రభుత్వం ● ఇందులో భాగంగా హనీ ట్రాప్, ఫోర్జరీ కేసుల్లో నిందితురాలైన జత్వానీకి వత్తాసు

సాక్షి, అమరావతి: వలపు వల (హనీ ట్రాప్)తో బడా బాబులను బ్లాక్ మెయిల్ చేయడం ఆమె వ్యవహార శైలి.. ఫోర్జరీ పత్రాలతో మోసాలకు పాల్పడటం ఆమె నైజం.. ఏపీ, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో కేసులు ఆమె నేర చరిత్రకు సాక్ష్యం.. ఫోర్జరీ నేరంపై విజయవాడ న్యాయస్థానం ఆదేశాలతో రిమాండ్.. ఇదీ ఇటీవల నేపథ్యం.. తీవ్రమైన నేరాల్లో నిందితురాలైన కాదంబరి జత్వానీ నిరాధార ఆరోపణలతో ముగ్గురు ఐపీఎస్ అధికారులపై ఫిర్యాదు చేస్తే, ప్రభుత్వం ఎలా స్పందించాలి? ఆమెను అరెస్ట్ చేసి, న్యాయస్థానం ద్వారా రిమాండ్ విధించిన అధికారులపై కక్ష పూరితంగా ఆరోపణలు చేస్తున్నట్టుగా భావించాలి. మరోవైపు ఆమె ఆరోపణలు ఎంత వరకు వాస్తవమో దర్యాప్తునకు ఆదేశించాలి. కానీ ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా ఉంది. జుగుప్సాకరమైన, తీవ్రమైన ఆర్థిక నేరాల్లో నిందితురాలైన కాదంబరి జత్వానీకి చంద్రబాబు ప్రభుత్వం విశిష్ట అతిథి స్థాయిలో ప్రోటోకాల్ మర్యాదలు చేస్తోంది. ఆమె ఫిర్యాదును సాకుగా చేసుకుని డీజీ పీఎస్ఆర్ ఆంజనేయులు, ఐజీ టి.కాంతి రాణా, డీఐజీ విశాల్ గున్నీలను ఏకపక్షంగా సస్పెండ్ చేసింది. ఎన్నికలకు ముందు తనను అరెస్ట్ చేయడాన్ని మనసులో పెట్టుకున్న చంద్రబాబు.. అధికారంలోకి రాగానే సీనియర్ ఐపీఎస్ అధికారులపై.. అదీ ఏకంగా డీజీ స్థాయి, ఐజీ, డీఐజీ స్థాయి అధికారులపై కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారని అర్థమవుతోంది. వ్యక్తిగత కక్షతోనే ఈ ముగ్గురు ఐపీఎస్ అధికారులపై ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగం మేరకు కుట్ర పూరితంగా కక్ష సాధింపునకు పాల్పడుతోంది.

కాదంబరితో క్విడ్ ప్రో కో కుట్ర

వలపు వల (హనీట్రాప్)తో బడా బాబులను బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడటమే వ్యాపకంగా మార్చుకున్న కాదంబరి జత్వానీతో కూడా చంద్రబాబు ప్రభుత్వం క్విడ్ ప్రో కో కుట్రకు తెరతీసింది. ఫోర్జరీ పత్రాలతో భూములు కొల్లగొట్టేందుకు యత్నించి అడ్డంగా దొరికిపోయిన ఆమెతో టీడీపీ ప్రభుత్వం అవగాహనకు రావడం విడ్డూరంగా ఉంది. తీవ్రమైన నేరాలకు పాల్పడిన కేసుల్లో నిందితురాలికి వత్తాసు పలుకుతూ ఐపీఎస్ అధికారులను వేధిస్తుండటం పట్ల అఖిల భారత సర్వీసు అధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. నేర చరిత్ర ఉన్న కాదంబరి జత్వానీతో తప్పుడు ఫిర్యాదు ఇప్పించి.. ఐపీఎస్ అధికారులు పీఎస్ఆర్ ఆంజనేయులు, టి.కాంతిరాణా, విశాల్ గున్నీలను ఇప్పటికే ఏకపక్షంగా సస్పెండ్ చేసిన ప్రభుత్వం.. వారిపై మరిన్ని వేధింపులకు పాల్పడేందుకు సన్నద్ధమవుతుండటం పట్ల ఆగ్రహం వ్యక్యం చేస్తున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాదంబరి జత్వానీ విజయవాడలో ప్రత్యక్షం కావడం వెనుక పక్కా కుట్ర దాగి ఉందని అధికార వర్గాలే వెల్లడిస్తున్నాయి. గతంలో ఆమెపై నమోదు చేసిన ఫోర్జరీ కేసును నీరుగారుస్తామని చెబుతూ.. అందుకు ప్రతిగా ఆ ముగ్గురు ఐపీఎస్ అధికారులకు వ్యతిరేకంగా ఫిర్యాదు చేయమని ఆమెకు షరతు విధించినట్టు స్పష్టమవుతోంది. చంద్రబాబు ప్రభుత్వ కథ, స్క్రీన్ ప్లే ప్రకారం కాదంబరి జత్వానీ నెల రోజులుగా విజయవాడలో హైడ్రామా సృష్టిస్తున్నారు. జత్వానీపై ఏపీ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో పలు కేసులు ఉన్నాయి. వలపు వలతో బడా బాబులను బ్లాక్ మెయిలింగ్ చేయడం ఆమె వ్యాపకంగా చేసుకున్నారని పలు ఫిర్యాదులు, విమర్శలు ఉన్నాయి.



నిందితురాలితో ప్రభుత్వం కుమ్మక్కు

పారిశ్రామికవేత్త కుక్కల విద్యాసాగర్‌కు చెందిన ఐదు ఎకరాలను ఫోర్జరీ పత్రాలతో మరొకరికి విక్రయించేందుకు కూడా కాదంబరి జత్వానీ బరి తెగించారు. వెంటనే అప్రమత్తమైన విద్యాసాగర్ ఈ ఏడాది ఫిబ్రవరిలో ఫిర్యాదు చేయడంతో విజయవాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. న్యాయస్థానం అనుమతితో నిబంధనలను పాటిస్తూ ముంబయిలో ఆమెను అరెస్ట్ చేసి విజయవాడ తీసుకువచ్చారు. ఫోర్జరీ అభియోగాలకు సంబంధించి పోలీసులు సమర్పించిన ఆధారాలతో న్యాయస్థానం సంతృప్తి చెంది ఆమెకు రిమాండ్ విధించింది. రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినంత మాత్రాన జత్వానీ గతంలో పాల్పడిన తీవ్రమైన, జుగుప్సాకరమైన నేరాలు ఒక్క దెబ్బతో మాయమైపోయినట్టు కాదని అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు. కేవలం తన ఫోర్జరీ బాగోతాన్ని ఆధారాలతోసహా వెలికి తీసినందుకే ముగ్గురు ఐపీఎస్ అధికారులపై ఆమె కక్ష గట్టారు. కాగా ఆ పోలీసు అధికారులను అక్రమ కేసులతో వేధించాలని నిర్ణయించిన చంద్రబాబు ప్రభుత్వం కాదంబరి జత్వానీని తమ కుట్రలో భాగస్వామిగా చేసుకుంది. ప్రభుత్వ పెద్దలు ఆమెతో ఇటీవల ఇప్పించిన ఫిర్యాదుతో నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో ఇంకొందరు పోలీసు అధికారుల పేర్లను కూడా చేర్చేందుకు సన్నద్ధమవుతున్నట్టుగా తెలుస్తోంది.

మరో టార్గెట్ రామకృష్ణే ..

చంద్రబాబు, ఈనాడు రామోజీరావు కుటుంబం క్విడ్ ప్రో కోకుట్ర మరోసారి అధికారికంగా బట్టబయలవుతోంది. అందులో భాగంగానే స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ పూర్వపు ఐజీ రామకృష్ణకు టీడీపీ కూటమి ప్రభుత్వం గురి పెట్టింది. ఎందుకంటే.. రామోజీరావు కుటుంబం దశాబ్దాలుగా మార్గదర్శి చిట్ ఫండ్స్ ద్వారా యథేచ్ఛగా పాల్పడిన ఆర్థిక అక్రమాలను ఆధారాలతో సహా ఆయన నిగ్గు తేల్చారు. కేంద్ర చిట్ ఫండ్ చట్టాన్ని పక్కాగా అమలు చేసేందుకు రామకృష్ణ ప్రయత్నించారు. ఆ చట్టాన్ని ఉల్లంఘిస్తూ రామోజీరావు కుటుంబం మార్గదర్శి చిట్స్ చందాదారుల సొమ్మును అక్రమ మార్గాల ద్వారా మళ్లించి తమ కుటుంబ వ్యాపార సంస్థలు, మ్యూచువల్ ఫండ్స్‌లో అక్రమ పెట్టుబడులుగా పెట్టినట్టు స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ గుర్తించింది. ఘోస్ట్ చందాదారుల పేరుతో అక్రమాలు, రశీదుల ముసుగులో అక్రమ డిపాజిట్ల సేకరణ తదితర ఆర్థిక నేరాలను వెలుగులోకి తెచ్చింది. దాంతో రెండేళ్లపాటు మార్గదర్శి చిట్ ఫండ్స్‌లో కొత్త చిట్టీ గ్రూపులు నిలిచి పోవడంతో రామోజీ కుటుంబ ఆర్థిక అక్రమాల పునాదులు కదిలాయి. స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ ఫిర్యాదుతో సీఐడీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. అక్రమాలకు పక్కా ఆధారాలు లభించడంతో గత ఏడాది రామోజీరావు (ప్రస్తుతం చనిపోయారు), ఆయన కోడలు శైలజ కిరణ్‌ను హైదరాబాద్‌లో విచారించారు. ఇది ఆ కుటుంబంతో అనుబంధం ఉన్న చంద్రబాబుకు ఏమాత్రం రుచించలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రామకృష్ణను వ్యక్తిగత లక్ష్యంగా చేసుకున్నారు. ఆయనకు పోస్టింగు ఇవ్వనే లేదు. మరోవైపు ఐఆర్ఎస్ అధికారిగా ఆయన డెప్యుటేషన్ పూర్తి కావడంతో కేంద్ర సర్వీసులకు తిరిగి వెళ్లాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం రిలీవ్ చేయకపోయినా సరే.. డీమ్డ్ టు బీ రిలీవ్‌గా పరిగణించి ఆయనకు కేంద్ర ప్రభుత్వం పోస్టింగు ఇచ్చేందుకు సిద్ధమైంది. నిబంధనల మేరకు సాగుతున్న పరిణామాలపై రామోజీరావు కుటుంబం భగ్గుమంది. రామకృష్ణను లక్ష్యంగా చేసుకుని ఈనాడు పత్రికలో రెండు రోజులుగా ప్రత్యేక కథనాలు ప్రచురించారు. రాజగురువు కుటుంబానికి ఆగ్రహం కలిగిందని బెంబేలెత్తిన చంద్రబాబు ప్రభుత్వం.. నిబంధనలను అతిక్రమించేందుకు కూడా వెనుకాడటం లేదు. రామోజీ కుటుంబాన్ని సంతృప్తి పరిచేందుకు రామకృష్ణపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయాన్ని ఆదేశించినట్టు సమాచారం. కేంద్ర ప్రభుత్వ అధికారి అయిన ఆయనపై ఏకపక్షంగా చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయ వర్గాలు తర్జన భర్జన పడుతున్నాయి. కానీ రామోజీ కుటుంబం కళ్లల్లో ఆనందం చూడటమే తమ లక్ష్యం.. అన్నట్లు రామకృష్ణపై చర్యలు తీసుకోవాల్సిందేనని ముఖ్యమంత్రి కార్యాలయం స్పష్టం చేసినట్టు సమాచారం. దాంతో రామకృష్ణపై ప్రభుత్వం ఒకట్రెండ్రోజుల్లో కక్ష సాధింపు చర్యలు చేపట్టే అవకాశాలున్నాయని సచివాలయ వర్గాలు చెబుతున్నాయి.

జిల్లా వార్తలు

ఐటీడీఏ ఏఓగా రాంబాబు బాధ్యతల స్వీకరణ



రాంబాబుకు శుభాకాంక్షలు చెబుతున్న ఏపీఓ, ఉద్యోగులు

భద్రాచలం: భద్రాచలం ఐటీడీఏ పరిపాలన అధికారి (ఏఓ)గా సున్నం రాంబాబు మంగళవా రం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో భద్రాచలం ఐటీడీఏలో విధులు నిర్వర్తించి బదిలీపై ఊట్నూరు వెళ్లానని, తిరిగి భద్రాచలం రావడం సంతోషంగా ఉందని తెలిపారు. కాగా, బాధ్యతలు స్వీకరించిన రాంబాబుకు ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

ఎన్‌సీసీ క్యాంప్‌లో పతకాల పంట



బహుమతులు అందుకుంటున్న విద్యార్థినులు

కొణిజర్ల: వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీలో ఇటీవల నిర్వహించిన ఎన్‌సీసీ కేడెట్–7 క్యాంపులో కొణిజర్ల మండలం తనికెళ్లలోని తెలంగాణ గిరిజన మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు సత్తా చాటారు. టగ్ ఆఫ్ వార్ పోటీలో ప్రథమ, గ్రూప్ డాన్స్‌లో ద్వితీయ, ఖోఖోలో ద్వితీయ స్థానం, త్రోబాల్‌లో ద్వితీయ స్థానం సాధించారు. అలాగే, సోలో డాన్స్‌లో కె.శ్రావిక ప్రథమ, పాటల పోటీల్లో ఎల్.నందిని ద్వితీయ, పరుగు పందెంలో ఎం.శిరీష తృతీయ స్థానాల్లో నిలిచి బహుమతులు అందుకున్నారు. విద్యార్థినులతో పాటు గైడ్ అధ్యాపకులను ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీవాణి అభినందించారు.

బొగ్గు రవాణా చర్చలు సఫలం



ఎమ్మెల్యే, జీఎం సమక్షాన చర్చిస్తున్న దృశ్యం

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్, ఎమ్మెల్యే కోరం కనకయ్య సమక్షాన కోల్ ట్రాన్స్‌పోర్టు ప్రతినిధులతో మంగళవారం నిర్వహించిన చర్చలు సఫలమయ్యాయి. ఇల్లెందులోని సింగరేణి గెస్ట్‌హౌజ్‌లో జరిగిన చర్చల్లో చర్చల్లో కేటీసీ నుంచి సీహెచ్‌పీకి బొగ్గు సరఫరా విషయమై చర్చించారు. ఈమేరకు బుధవారం నుంచి ప్రతీరోజు నాలుగు వేల టన్నులు బొగ్గు రవాణా చేసేందుకు అంగీకారం కుదిరింది. ఈ సమావేశంలో సింగరేణి అధికారులు బొల్లం వెంకటేశ్వర్లు, మధుబాబు, దీలీప్‌కుమార్, శివకుమార్, అంజిరెడ్డి, కోల్ ట్రాన్స్‌పోర్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులకు భరోసా

- కార్మికుల సంక్షేమంపై యాజమాన్యం ప్రత్యేక దృష్టి
- ఉచితంగా ప్రమాద బీమా
- ఈఎస్‌ఐ వైద్యసేవల ఏర్పాటుకు సన్నాహాలు
- సంస్థ వ్యాప్తంగా 31,900 మందికి ప్రయోజనం



కొత్తగూడెంలో సీఎండీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు (ఫైల్)

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి, ఓవర్ బర్డెన్ తొలగింపుతో పాటు ఇతర అన్ని పనుల్లో కీలక పాత్ర పోషిస్తూ, సంస్థ అభివృద్ధి పర్మినెంట్ కార్మికులకు దీటుగా పనిచేస్తున్న వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సంక్షేమంపై యాజమాన్యం దృష్టి సారించింది. గతంలో సింగరేణి ఆస్పత్రుల్లో కేవలం కార్మికుడికి సేవలందిస్తుండగా, ఇప్పుడు ఈఎస్‌ఐ ద్వారా కార్మికులు, వారి కుటుంబాలకు సైతం వైద్యసేవలందించనున్నారు. అంతేకాక ఉచిత ప్రమాద బీమా అమలుకు బ్యాంకులతో ఎంఓయూ కుదుర్చుకుంది. ఇక ఖాళీగా ఉన్న క్వార్టర్లను మరమ్మతు చేసి కేటాయించేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది.

46 విభాగాల్లో విధులు

సంస్థలోని భూగర్భ గనులు, ఓపెన్‌కాస్ట్ గనులతో పాటు ఇతర కార్యాలయాల్లోని 46 విభాగాల్లో 31,900మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారు. కొత్తగూడెం ఏరియా, కార్పొరేట్‌లో 6,500 మంది, మణుగూరులో 2,200 మంది, ఇల్లెందులో 400 మంది, సత్తుపల్లిలో 800మంది, రామగుండం, బెల్లంపల్లి రీజియన్లలో 11వేల మంది చొప్పున కార్మికులు ఉన్నారు. వీరందరికీ బ్యాంకు ఖాతా ఆధారంగా ఉచిత ప్రమాద బీమా అమలుకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుతో యాజమాన్యం ఒప్పందం చేసుకుంది.

బీమా ఇలా...

ప్రమాదంలో ఒప్పంద కార్మికుడు మృతి చెందితే వారి కుటుంబానికి రూ.20 లక్షల బీమా సొమ్ము అందిస్తారు. అలాగే, డెబిట్‌కార్డ్ వాడకం ఆధారంగా రూ.10 లక్షల అదనపు బీమా వర్తిస్తుంది. శాశ్వత, పూర్తి ప్రమాద వైకల్యం సంభవిస్తే రూ.20 లక్షల బీమా సదుపాయం ఉంటుంది. ఉద్యోగి ప్రమాదంలో మృతిచెందితే వారి పిల్లల చదువుకు రూ.4 లక్షల ఆర్థిక సాయం అందుతుంది. అనారోగ్య కారణంతో ఆస్పత్రిలో చేరి చికిత్స తీసుకుంటే రోజుకు రూ.వెయ్యి చొప్పున 15 రోజుల పాటు ఆర్థిక సాయం లేదా ఏడాదిలో గరిష్టంగా రూ.15 వేల సాయం అందిస్తారు.

వేతనాలు కూడా పెంచాలి...

కాంట్రాక్టు కార్మికులకు వివిధ పథకాలు అమలుచేస్తున్న యజమాన్యం వేతనాలు కూడా పెంచాలని కోరుతున్నారు. 2017లో కుదిరిన వేతన ఒప్పందం ప్రకారం అన్‌స్కిల్డ్ కార్మికులకు రూ.522, సెమీ స్కిల్డ్ వారికి రూ.610, స్కిల్డ్ కార్మికులకు రూ.734, హై స్కిల్డ్ వారికి రూ.862 చొప్పున మస్టర్ వారీ వేతనం అందుతోంది. అయితే, కోలిండియా ఆదేశాల మేరకు ప్రతీ ఐదేళ్లకోసారి 30 శాతం వేతనాలు పెరగాల్సి ఉంది. కానీ గత ఏడేళ్లుగా పెంచనందున ఇకనైనా దృష్టి సారించాలని కోరుతున్నారు.

అప్పుడే న్యాయం జరుగుతుంది..



సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలను 2017 తర్వాత పెంచలేదు. ప్రతీ ఐదేళ్లకోసారి పెంచాల్సి ఉన్నా పట్టించుకోకపోవడం సరికాదు. ఇతర పథకాలు అమలు చేస్తున్నట్లుగానే శ్రమదోపిడీ జరగకుండా వేతనాలు కూడా పెంచితేనే కార్మికులను న్యాయం జరుగుతుంది.

– షేక్ యాకూబ్ షావలీ, ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు

కార్మికులపై సీఎండీ శ్రద్ధ



కాంట్రాక్ట్ కార్మికుల సంక్షేమంపై సింగరేణి సీఎండీ దృష్టి సారించడం అభినందనీయం. ప్రమాద బీమాతోపాటు, ఈఎస్‌ఐ ఆస్పత్రిలో సేవలు అందించాలని నిర్ణయించారు. త్వరలోనే కార్మికులకు ఖాళీగా ఉన్న క్వార్టర్లను కేటాయించాలని ఆలోచన చేస్తుండడం ఆనందంగా ఉంది.

– ఈ.నాగేశ్వరరావు, బీఎంఎస్ కాంట్రాక్ట్ విభాగం ప్రధాన కార్యదర్శి

చెత్త వేస్తే సహించేది లేదు..

మున్సిపల్ వాహనాలను అడ్డుకున్న స్థానికులు



వాహనాలు అడ్డుకుని నినాదాలు చేస్తున్న స్థానికులు

వైరారూరల్: వైరా మండలంలోని స్టేజీ పినపాక హైలెవల్ వంతెన కింద మున్సిపాలిటీ పరిధిలో సేకరించిన చెత్త వేస్తే అడ్డుకుంటామని స్టేజీ పినపాక, గండగలపాడు గ్రామ రైతులు, స్థానికులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం చెత్తతో వచ్చిన వాహనాలను అడ్డుకుని నిరసన తెలిపారు. జాతీయ రహదారికి అనుసంధానంగా ఉన్న హైలెవల్ వంతెన కింద చెత్త డంప్ చేయడంతో వరద వచ్చిన సమయాన చెత్త తమ పొలాల్లో మేట వేస్తోందని చెప్పారు. అంతేకాకుండా దుర్వాసనతో ఇబ్బందులు తలెత్తున్నాయని తెలిపారు. ఇదిపోగా నిప్పంటుకుని వెలువడే పొగతో వాహనదారులు అవస్థ పడుతున్నారని వాపోయారు. ఇకనైనా చెత్తను హైలెవల్ వంతెన కింద కాకుండా ప్రభుత్వం రిజర్వాయర్ సమీపాన కేటాయించిన స్థలంలో చెత్తను డంప్ చేయాలని డిమాండ్ చేశారు.

సింగరేణి క్యాంటీన్‌లో మధ్యాహ్న భోజనం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి కార్పొరేట్ క్యాంటీన్‌లో మంగళవారం నుంచి మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించారు. కరోనాకు ముందు ఉద్యోగులు, కార్మికుల కోసం క్యాంటీన్‌లో తక్కువ ఖర్చుతో టిఫిన్, భోజన సౌకర్యం ఉండగా, ఆతర్వాత నిలిచిపోయింది. ఇటీవల వినతులు రావడంతో ఈ సౌకర్యాలు పునరుద్ధరించారు. ఈసందర్భంగా యూనియన్ నాయకులు మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభించి మాట్లాడుతూ ఉద్యోగులు, కార్మికుల సౌకర్యార్థం భోజనం సమకూర్చేందుకు సంస్థ నిర్ణయించిందని తెలిపారు. ఐఎన్‌టీయూసీ కార్పొరేట్ ఉపాధ్యక్షుడు పీతాంబరం, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ రమణమూర్తి, కమ్యూనికేషన్ సెల్ ఆఫీసర్ టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారుల వెంట 3వేల మొక్కలు

నేషనల్ హైవేస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ దివ్య



పైనంపల్లి టోల్‌గేట్ పనులను పరిశీలిస్తున్న పీడీ దివ్య, అధికారులు

నేలకొండపల్లి: జాతీయ రహదారుల వెంట మంగళవారం ఒకేరోజు మూడు వేల మొక్కలు నాటామని నేషనల్ హైవేస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.దివ్య వెల్లడించారు. జాతీయ స్థాయి ప్లాంటేషన్ డ్రైవ్ సందర్భంగా నేలకొండపల్లి మండలం పైనంపల్లి టోల్‌గేట్ వద్ద మంగళవారం ఆమె మొక్కలు నాటారు. అనంతరం టోల్‌గేట్ వద్ద పనులను పరిశీలించి త్వరగా పూర్తిచేయాలని సూచించారు. అనంతరం పీడీ మాట్లాడుతూ కోదాడ–ఖమ్మం, దేవరపల్లి–ఖమ్మం జాతీయ రహదారి పరిధిలో మూడు వేల మొక్కలు నాటామని తెలిపారు. కాగా, కోదాడ–ఖమ్మం జాతీయ రహదారి పనులు ఇంకా 1.3 కి.మీ. మేర చేపట్టాల్సి ఉందని, ఈ పనులు పూర్తిచేసి త్వరలోనే రహదారిని ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీమ్ లీడర్ పి.రామిరెడ్డి, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి రూ.10.11లక్షలు



మంత్రి తుమ్మలకు చెక్కు అందిస్తున్న చాంబర్ ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: మున్నేటి వరదతో నష్టపోయిన వారిని ఆదుకునేలా ముఖ్యమంత్రి సహాయ నిధికి ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ తరఫున రూ.10,11,000 విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా చెక్కును మంగళవారం ఖమ్మంలో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవ అధ్యక్షుడు మేళ్లచెరువు వెంకటేశ్వరరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిన్ని కృష్ణారావు, మెంతుల శ్రీశైలంతో పాటు మన్నెం కృష్ణ, తల్లాడ రమేష్, కైలాసపు వేణుగోపాల్, పాయల నాగేశ్వరరావు, నేరెళ్ల శేషగిరిరావు, విడాల శ్రీనివాసరావు, దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, ముత్యం ఉప్పల్‌రావు, మాటేటి నాగేశ్వరరావు, యడ్లపల్లి సతీష్, మలిశెట్టి వెంకటేశ్వర్లు, నల్లమల ఆనంద్, వేములపల్లి వెంకటేశ్వరరావు, తేరాల ప్రవీణ్ పాల్గొన్నారు.

సింగరేణి స్థాయి పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న జీఎం సామ్యేల్ సుధాకర్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి స్థాయి బాడీ బిల్డింగ్, పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్ పోటీలు మంగళవారం కొత్తగూడెంలో సీఈఆర్ క్లబ్‌లో ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల నుంచి ఆరు జట్లు హాజరు కాగా 250 మంది క్రీడాకారులు ఉన్నారు. వీరిలో 50 మంది మహిళా ఉద్యోగినులు ఉండడం విశేషం. కాగా, పోటీలను జీఎం పర్సనల్(వెల్ఫేర్ అండ్ ఆర్సీ) సామ్యేల్ సుధాకర్ ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులు సత్తా చాటి కోలిండియా స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఉద్యోగులు క్రీడాపోటీల్లో పాల్గొనడం ద్వారా పోటీ తత్వం పెరగడమే కాక స్నేహభావం పెంపొందుతుందని తెలిపారు. జీఎం సెక్యూరిటీ కె.శ్రీనివాసరావు, వివిధ సంఘాల నాయకులు, ఉద్యోగులు ఎస్‌వీ.రమణమూర్తి, పీతాంబరం, ఎం.విజయ్‌భాస్కర్‌రెడ్డి, టి.శ్రీనివాసరావు, పాసినెట్, ఏ.వీ.రమేష్ తదితరులు పాల్గొన్నారు.